క్లుప్తంగా

బైక్‌కు నిప్పు పెట్టిన ఆగంతకులు


దగ్ధం అయిన బైక్

సదుం: ఆగంతకులు నిప్పు పెట్టడంతో మోటార్ సైకిల్ దగ్ధమైన సంఘటన మండలంలోని ఎగువ జాంద్రపేటలో చోటుచేసుకుంది. బాధితుని కథనం ..గ్రామానికి చెందిన అస్లాంబాషా పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన ఇంటి పక్కనే బైక్‌ను ఉంచి నిద్రపోయాడు. రాత్రి 11.30 గంటల సమయంలో కాలుతున్న వాసనతో పాటు శబ్దాలు రావడంతో లేచి బయట వచ్చి చూశాడు. ఎవరో నిప్పు పెట్టడంతో బైక్ దగ్ధం అవుతూ కనిపించింది. పండ్ల కోసం ఉంచిన ట్రేలు, పుచ్చకాయలు దెబ్బతిన్నాయి. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ షేక్‌షావలి పరిశీలించారు. అస్లాం స్థానికంగా ఉన్న కొందరిపై అనుమానం వ్యక్తం చేస్తూ వారి గురించి పోలీసులకు తెలిపాడు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువ పోకలవారిపల్లెలో సోమవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్, పోకల జనార్దన్, లక్ష్మీ నారాయణ, పోకల గంగయ్య, దాము, కృష్ణమూర్తి, శివ, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కుప్పం: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని అధికారులను కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను వివిధ సమస్యలపై 26 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ సంబంధించి అధికంగా 13 ఫిర్యాదులు వచ్చాయని, సంబంధిత శాఖలు ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు త్వరిగతిన తీసుకోవాలన్నారు.

అడ్వాన్స్ సొమ్ము తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదు

చౌడేపల్లె: జేసీబీ కొనుగోలు చేయిస్తామని చౌడేపల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులు తన వద్ద తీసుకున్న అడ్వాన్స్ సొమ్ము రూ.50 వేలు తిరిగి ఇవ్వలేదంటూ గోసలకురప్పల్లెకు చెందిన శ్రీదేవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సొమ్ము తీసుకుని రెండునెలలుగా తనను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకుని నగదు ఇప్పించాలని పోలీసులను కోరినట్లు బాధితురాలు తెలిపింది.

రాయితీపై పండు ఈగ బుట్టలు

శాంతిపురం: మామిడి పంట నాణ్యతపై తీవ్ర ప్రభావం చూసే పండు ఈగల నివారణకు అవసరమైన బుట్టలను రాయితీపై ఇస్తున్నట్టు ఉద్యానవన శాఖాధికారిణి వింధ్య తెలిపారు. ఒక్కో బుట్ట రూ.11 చొప్పున ఎకరాకు 8 బుట్టలను, 24 ఎరలను ఇస్తామన్నారు. ఈ బుట్టలను భూమి నుంచి 5–6 అడుగుల ఎత్తులో ఉండేలా కొమ్మలకు కట్టి, 4–5 చుక్కల మెలాథియాన్ వేసిన ఎరలను అందులో ఉంచాలని చెప్పారు. ఈ వాసనకు పండు ఈగలు ఆకర్షితమై చనిపోతాయన్నారు. ఆసక్తి ఉన్న శాంతిపురం, గుడుపల్లె మండలాల రైతులు పట్టాదారు పాసు పుస్తకం జెరాక్సు, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రంలో లేదా తనను సంప్రదించాలన్నారు.

4 నుంచి విత్తన కాయలు పంపిణీ


బండారువారిపల్లె వద్ద సిద్ధం చేసిన దుక్కులు

పులిచెర్ల(కల్లూరు): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి మండలానికి 782 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వచ్చాయని మండల వ్యవసాయ శాఖాధికారి హరిప్రసాద్ తెలిపారు. 4వ తేదీన రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలు వేసేందుకు దుక్కులు సిద్ధం చేశారు. మరోవైపు అడవి పందుల బెడద, ఏనుగుల బెడద ఎక్కువగా ఉండడంతో ఈ పర్యాయం ఏ మేరకు సాగు చేస్తారో వేచి చూడాలి.

క్షయ, హెచ్‌ఐవీపై కళాజాత

తవణంపల్లె: స్థానిక వారపు సంతలో సోమవారం హెచ్‌ఐవీపై కళాజాతతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో కళాజాత సభ్యులు క్షయవ్యాధి, హెచ్‌ఐవీ ఎలా వస్తాయి ? వస్తే ఏమి చేయాలనే విషయాలపై పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రెడ్డెమ్మ, ఎల్‌టి శేఖర్, కేర్ ఎన్‌జీఓ సద్దాం, కళాకారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల నిశీధి

మీరంతా మా అక్కచెల్లెమ్మలు..18 ఏళ్లు నిండితే చాలు..ఎంతమంది మహిళలు ఉంటే ఆ ఇంట వారందరికీ నెలకు రూ.1500 చొప్పున 'ఆడబిడ్డ నిధి' పథకం పేరిట ఇస్తాం.. అని ఎన్నికలప్పుడు కూటమి నేతలు ఊదరగొట్టారు. దీంతో మహిళలు సంబరపడి గెలిపించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ హామీని నెరవేర్చకపోవడంతో తమను వంచించారని మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు.

- 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ రూ.15వేలన్న కూటమి నేతలు
- ఆడబిడ్డ నిధి పథకం పేరిట వంచన
- అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయని వైనం
- 'బాబు' ష్యూరిటీ..భవిష్యత్తుకు లేదు గ్యారెంటీ అని శాపనార్థాలు పెడుతున్న మహిళలు


గత ఏడాది ఎన్నికల ప్రచారంలో పలమనేరులో హామీలను గుప్పిస్తున్న చంద్రబాబు.(ఫైల్)

పలమనేరు: ఎలాగైనా అధికారంలోకి రావాలని కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పేరిట జనాన్ని నమనమ్మించి గద్దెనెక్కింది. 'తల్లికి వందనం' పథకం ప్రకటించి తల్లుకు ఎగనామం పెడుతూనే ఉన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తుంటే ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, రైతులకు ఏటా రూ.వేలు, 20లక్షల ఉద్యోగాలు, నెలకు మూడువేలు చొప్పున నిరుద్యోగ భృతి, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం..ఇలా ఎన్నికలప్పుడు ఊదరాదరా ఊదరగొట్టి, వాటి ఊసే ఎత్తడం లేదు. ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తోంది అంటూ '40 ఇయర్స్ ఇండస్ట్రీ' పథకాలు అమలు చేయడం అసాధ్యమంటూ ఓట్లేసిన జనానికి కుచ్చుటోపీ పెట్టారు.

రూ.235కోట్ల మోసం

పలమనేరు నియోజకవర్గంలో 1.31లక్షలమంది మహిళలున్నారు. వీరికి నెలకు రూ.19.6 కోట్లు కావాలి. ఆ లెక్కన కూటమి అధికారంలోకి వచ్చి 12నెలలు దాటింది. ఈ లెక్కన ఇప్పటిదాకా ఎంత మోసం చేసిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

వైఎస్సార్ సీపీ పాలనలో రూ.24.05కోట్ల లబ్ధి

గత వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలోని మహిళలకు చేదోడు ద్వారా 2201మందికి ఏటా రూ.4.81కోట్ల లబ్ధి కలిగింది. ఆ మేరకు ఐదేళ్లలో రూ.24.05 కోట్ల మొత్తం పొందారు. కూటమి నేతలు హామీని నెరవేరుస్తారా? ఎప్పటిలాగే సాగదీతలతో కాలం వెళ్లబుచ్చుతూ ఎన్నికల సమయంలో అమలు చేస్తారా? అనే ప్రశ్నలు మహిళల్లో రేకెత్తుతున్నాయి.

ఆడబిడ్డల నిధి వస్తుందో, రాదో?



గత ప్రభుత్వంలో మా గ్రూపులో అప్పు తీసుకుని మేము కట్టిన వడ్డీని మూడు విడతలుగా మా ఖాతాల్లోకి వేశారు. అప్పట్లో జగనన్న చెప్పినట్టు 2014 నుంచి 2019 ఏప్రిల్ వరకు అప్పు తీసుకున్న గ్రూపులో మేమూ ఉన్నాం. అదనంగా మాకు లభించిన డబ్బు మాకెంతగానో ఉపయోగపడింది. కూటమి ప్రభుత్వం మహిళలకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటిదాకా దాని ఊసేలేదు.

–సి.రాణి, ముత్తువారిపల్లె, పులిచెర్ల మండలం

ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాల్సిందే!



ఇంట్లో ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి వాళ్లు నమ్మించారు. ఓట్లేయించుకున్నారు. ఇంత వరకు దీనిపై అతీగతీ లేదు. ప్రచారానికి వచ్చినప్పుడేమో మీకు..మీకు ..అంటూ అందరికీ డబ్బులేనంటూ లెక్కలు చెప్పారు. అసలు ఇస్తారో, లేదో అనుమానం కలుగుతోంది. ఇస్తారనే ఆశతో గెలిపిస్తే ఇప్పుడేమో మాట మార్లారు. కానీ మా ఆడోళ్లు ఇచ్చేంతవరకు చంద్రబాబన్నను వదలం.

మేనక, ఈశ్వర్‌నగర్, వీ.కోట

అమలు సాధ్యం కాని హామీలతో వంచన



ఎన్నికలపుడు సూపర్‌సిక్స్ అని హామీలిచ్చి ఇప్పుడు ఖజానా ఖాళీగా ఉంది ఏమి చేయలేమని చెబితే ఎలా? హామీలు నెరవేర్చడం లేదు. నిజాయితీగా ఇది చేయలేము అని చెప్పుంటే బాగుండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ పథకాలు మహిళలకే వచ్చాయి. ఇంటి చక్కదిద్దుకునే మహిళలకు ఆర్థిక భరోసా రావడంతో ఎన్నో కుటుంబాలు నాడు బాగుపడ్డాయి.

జమీల, గృహిణి, పలమనేరు

ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే!



గత ఎన్నికలపుడు కూటమి నేతలు ఇచ్చిన హామీలను విధిగా నెరవేర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఎందుకంటే వారి మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు మాట తప్పితే పురుషులు గమ్మునుంటారేగానీ మనసులో బాధపడుతున్న మహిళలు మాత్రం వదిలిపెట్టరు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల.

భువనేశ్వరి,
ఐద్వా జిల్లా కన్వీనర్, పలమనేరు

రేపటి నుంచి వేరుశనగ విత్తనాలకు నమోదు

- రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్
- 30 కిలోల బస్తా రాయితీ ధర రూ.1,674
- పలమనేరు ఏడీఏ గీతాకుమారి


పలమనేరు చేరిన వేరుశనగ విత్తనాలు

పలమనేరు: వేరుశనగ విత్తనకాయల కోసం రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో 4వ తేదీ బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలమనేరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు గీతాకుమారి సోమవారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు గాను డివిజన్‌లోని ఏడు మండలాలకు కదిరి–6 రకం విత్తనాలు 7,075 క్వింటాళ్లు అందుబాటులో ఉందని, వీటిలో పలమనేరు మండలానికి 672 క్వింటాళ్లు, బైరెడ్డిపల్లెకు 1313, వీ.కోటకు 1346, రామకుప్పం 1072, శాంతిపురం 1403, కుప్పం 847, గుడుపల్లెకు 419 క్వింటాళ్లను కేటాయించినట్లు చెప్పారు. 40శాతం సబ్సిడీతో బస్తా (30కేజీలు) రూ.1674తో రైతు చెల్లించాలన్నారు. దీనికిగాను రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, లింకైన మొబైల్‌ను వెంట తీసుకెళ్లి ఆర్‌ఎస్‌కేల్లో నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే, విత్తనాలకు తీసుకున్న రైతులు పంటసాగు చేస్తామనే ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుందని, తీసుకున్న విత్తనాలను వ్యాపారులకు కమీషన్లు తీసుకొని ఇస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా గంగమాంబ జాతర


ప్రత్యేక అలంకరణలో గంగమాంబ


పుష్పపల్లకిపై ఊరేగుతున్న అమ్మవారు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ధర్మకర్త, పోలీసులు

వి.కోట: పట్టణంలో గంగమాంబ జాతర మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, సాయంత్రం గంగమాంబ అమ్మవారి శిరస్సు, పూలగెరిగ, ఇతర మనోరంజక భక్తి కార్యక్రమాలు,, పుష్పపల్లకి, బాణ సంచా వేడుకలు నిర్వహించారు. మంగళవారం అగ్నిగుండ ప్రవేశం, అమ్మవారి అభిషేకం , అనంతరం రాత్రి 12 గంటలకు వసంతోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

ఎట్టకేలకు పొగ నుంచి విముక్తి

- డంపింగ్ యార్డులో చెత్త నుంచి సంపద తయారీ ప్రారంభం


డంపింగ్ యార్డులో ఏర్పాటు చేస్తున్న యంత్రాలు

కుప్పం రూరల్: ఎట్టకేలకు డంపింగ్ యార్డు చుట్టుపక్కల ప్రజలకు పొగ నుంచి విముక్తి లభించింది. డంపింగ్ యార్డులో చెత్త నుంచి సంపద తయారీకి అధికారులు మెషిన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇకపై యార్డు నుంచి భారీ ఎత్తున వెలువడే పొగ నుంచి విముక్తి లభించిందని చుట్టుపక్కల ప్రాంతాలైన పలవరిగానిమిట్ట, శ్రీలంక కాలనీ, అమరావతి కాలనీ, మోడల్ కాలనీ, మల్లేపల్లె, డి.కె.పల్లె వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కుప్పం నుంచి వెలువడే చెత్త సాయిబాబా దేవాలయం సమీపంలోని డంపింగ్ యార్డులో వేసేవారు. యార్డులోని చెత్తకు తరచూ అగ్గి అంటుకుంటూ భారీ ఎత్తున పొగ వెలువడేది. ఈ పొగ కాలుష్యంపై స్థానికులు పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు మొదలుకుని కలెక్టర్ వరకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం శూన్యం. సాక్షి పత్రిక బాధితుల ఆక్రోశం, సమస్యపై కథనాలు ప్రచురించింది. ఇప్పటికి స్పందించిన రాష్ట్రస్థాయి అధికారులు ప్రమేయంతో రెండు రోజులుగా చెత్త నుంచి సంపద తయారీకి డంపింగ్ యార్డులో యంత్రాల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవసరం మేరకే ఎరువుల వాడకం


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

గంగవరం: పంటల సాగులో అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని ఏడీఏ శివకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని జీడిమాకులపల్లె రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలు, సస్యరక్షణ, వేరుశనగ రకాలు, విత్తన శుద్ధి, కలుపు మందుల గురించి అవగాహన కల్పించారు. వేరుశనగ విత్తిన వెంటనే సరిపడా మందులు పిచికారీ చేసినట్లయితే పంట ఆరోగ్యంతో పాటు కాయలు బాగా ఉత్పత్తి అవుతాయన్నారు. అడవి పందుల బెడద నివారణ కోసం పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా గట్లపై నాటేందుకు అల్లనేరేడు, చింత, ఎర్రచందనం మొక్కలు ఉచితంగా ఇస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొన్న తరువాత వాటికి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారిణి హేమలత, సస్యరక్షణ శాస్త్రవేత్త(కేవీకే) డాక్టర్ పీరా సాహెబ్, రైతులు పాల్గొన్నారు.

స్కూళ్లకు పుస్తకాల పంపిణీ


పాఠశాలలకు పంపిణీ చేస్తున్న పుస్తకాలు


రొంపిచెర్లలో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కుప్పం రూరల్: మండలంలోని అన్ని స్కూళ్లకు ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ–2 రాజారాం తెలిపారు. సోమవారం నుంచి పుస్తకాలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తగినన్ని పుస్తకాలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిట్టిబాబు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం 11,435 పాఠ్య పుస్తకాలు మంజూరు చేసిందని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో 2387 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరికి 15,218 నోటు పుస్తకాలు, 2,387 స్కూల్ బ్యాగులు, 1,622 మంది పిల్లలకు బెల్ట్‌లు వచ్చాయని తెలిపారు. స్కూళ్ల పునః ప్రారంభం రోజున వీటిని పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన యూనిఫాం కూడా త్వరలోనే వస్తుందన్నారు.

4న పుంగనూరుకు తరలిరండి

- 'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం


చౌడేపల్లె: వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

చౌడేపల్లె: పుంగనూరులో ఈ నెల 4న బుధవారం నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బస్టాండు కూడలిలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులు, పార్టీనేతలతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తోందని, అందుకే ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవి మిథున్‌రెడ్డి నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.ఎంపీపీ రామమూర్తి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించి, ఘన నివాళులు అర్పించారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేద్దాం

రొంపిచెర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలతో ప్రజలను చేసిన వంచనపై జూన్ 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి , జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం చిచ్చిలివారిపల్లెలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి వెన్నుపోటు నిరసనకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, మండల కన్వీనర్ కరీముల్లా, నాయకులు అల్లాబక్ష్, ఖలీల్, గురు, ఐడియా కాలేషా, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 4న పుంగనూరులో నిర్వహించనున్న భారీ నిరసనకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. వెన్నుపోటు దినం పోస్టర్లను కల్లూరులో ఆవిష్కరించి మాట్లాడారు. టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, పోకల చంద్రారెడ్డి, అహమ్మద్, మునస్వామి గోవర్ధన, చంద్రశేఖరరెడ్డి, మువ్వల నరసింహులు శెట్టి, మండల ఉపాధ్యక్షుడు ఆనంద, నిరంజన్ రెడ్డి, ఎస్వీ రమణ, ప్రతాప్‌రెడ్డి, గోవింద రెడ్డి, నాగరాజ ప్రసాద్, దాము, సైదుల్లా తదితరులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: వెన్నుపోటు దినం పోస్టర్లను పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచులు ఉషారాణి, హనుమంతరెడ్డి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు సయ్యద్‌బాషా, చిన్నరమణ, వెంకటస్వామి, సీతాపతి, ఆనందరెడ్డి, వాసు, ఇర్ఫాన్, రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రొంపిచెర్ల చిచ్చిలివారిపల్లెలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కల్లూరులో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


సదుం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



చిత్తూరు రూరల్ (కాణిపాకం): నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించి సీపీఐ నగర కార్యదర్శి గోపినాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడారు. జిల్లాలో వేలాదిమంది తలదాచుకోవడానికి గూడు లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనార్టీలు బాడుగ ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ప్రభుత్వమే మంజూరు చేసి నిరుపేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని పెద్ద దళితవాడ, లెనిన్ నగర్, మంగసముద్రం హౌసింగ్ కాలనీ, చామంతిపురం, గూలింగ్స్ పేట్, మసీదుమిట్ట ప్రాంతాల నిరుపేదలు అర్జీలు పెట్టుకున్నారని, వాటిని ఆయా గ్రామ వార్డు సచివాలయాలకు పరిశీలన కోసం పంపుతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.